# దేవుడు చూపిన మార్గం +

రచన:
శ్రీ. సి. ఎమ్. రామకృష్ణారెడ్డి.

అల్మైరాలో చిందర వందరగా వున్న పుస్తకాలను పక్కగా సర్దుతున్న నేను, దగ్గరగా వేసివచ్చిన తలుపులను ఎవ్వరో త్రోసినట్లయ్యేసరికి వెనుదిరిగి చూసాను. బయటనుంచి పారిజాత సుమాల పరిమళం గుప్పున వస్తుంది. తలుపు దగ్గరగా విద్యార్థి కార్యదర్శి రఘునందన్ నాకేసిచూస్తూ నిలబడివున్నాడు. అతని వెనుకగా నలుగు రయిదుగురు విద్యార్థులు నిలుచుని వున్నారు. వాళ్ళందరి మధ్యలో 'సుధ' తలవొంచుకొని నిలబడి వున్నాడు. సుధ తలఎత్తి చూచినప్పుడల్లా అతని కళ్ళల్లోని దైన సాహృదయాన్ని ఆకట్టుకో గలుగుతుంది. సుధను కించ పరుస్తునట్లు చూస్తున్న ఆవిద్యార్థుల హేళనాత్మకమైన దృష్టులను భరించలేని నేను, సుధ, రఘునందన్ తప్ప మిగతా వారిని వెళ్ళిపొమ్మన్నాను. సుధ ఏదో తప్పు చేసివుంటాడు. అయితే అది ఏలాంటి తప్పో అర్థంకాని నేను విషయ మేమిటన్నట్లు రఘునందన్ కేసి చూశానునిల్చునే—.

'సార్, సుధ ప్రవర్తన రాను రానూ మితిమీరి పోతున్నది. హాస్టల్ లోని ప్రతి విద్యార్థి తమ వస్తువులలో ఏదో ఒకటి పోయిందని రిపోర్టు చెయ్యడం, ఆ వస్తువు సుధ పుస్తకాలలోనో లేక అతని పెట్టెలోనో దొరకడం నిత్యం జరుగుతూ వస్తుంది. ప్రతి చిన్న విషయానికి మీతో తెల్పడం ఎందుకంటూ ఇంతవరకూ సుధ విషయాన్ని మీతో తెల్పకుండానే వచ్చాం. నిన్న పదియవ రూము నెంబరు విద్యార్థి కృష్ణన్ ఫౌంటన్ పెన్ పోయింది. రూములన్నీ గాలించగా తుదకు ఆ పెన్ సుధ పుస్తకాలు దొంతరలో దొరికింది. ఇతరుల పెనాలు దొంగిలించేంత ఖర్మ తనకు కలగలేదని తను హాస్టల్ ఫౌంటన్ వద్ద సాయంత్రవేళ కూర్చుని వుండగా, పచ్చికలో తనకు ఆ పెన్ కన్పించిందని, అది ఎవ్వరిదీ కాదని దొరికినందువల్ల తనదే అని, కావలసివుంటే వార్డెన్ తో నయినా రిపోర్ట్ చేసుకోమని కృష్ణన్ వాదించి అతన్ని తన రూము నుంచి పంపివేశాడు. ఎందరు విద్యార్థులు చెప్పినా సుధ వినిపించుకోలేదు. తుదకు విసిగి ఈ విషయాన్ని మీతోనే చెప్పాలని ఇక్కడికి వచ్చాం''.

రఘునందన్ వొత్తి వొత్తి చెప్తున్న ప్రతి వాక్యాన్ని మౌనంగానే వింటూ నిల్చున్నాను.

సుధతో నాకు పరిచయం ఒక విచిత్ర వాతావరణంతో ఏర్పడింది. ఎక్కడో అమెరికాలో డాక్టరేట్ చదువుతున్న మైథిలితో నాకు ఓ సొసైటీ ద్వారా 'కలంస్నేహం' ఏర్పడటం, అది బాగా వృద్ధి పొందేసరికి, మైథిలి ఇండియాకు తిరిగి వచ్చి, ఆమె తమ్ముని వార్డెన్ గా వుంటున్న స్కూల్ హాస్టల్ లో చేర్పించటం ఇవన్నీ ఇప్పుడు అనుకొంటే తమకు విచిత్రాను భూతి కలుగుతుంది. అసలు సుధ ఎవరు? తను ఎవరు? తనకు సుధపై గల మమకారానికి కారణమేమటి? సుధ మైథిలి తమ్ముడయినందు వల్లనా!

సుధను సక్రమమైన మార్గంలోకి తీసుక వచ్చేందుకు సరియైన విధాన మేమి టంటూ ఆలోచిస్తున్న నేను, హాస్టల్ ఫివన్ వచ్చి దగ్గరగా నిల్చునే సరికి ఏమిటంటూ వాడి కేసి చూశాను. వాడు నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే నా చేతిలో నీలం రంగు కాగితాన్ని వుంచి వెళ్ళి పోయాడు. నీలం రంగు కాగితం మడతలు విప్పి చూశాను— 'గాడ్ మే బ్లెస్ యూ! కమ్ అలాంగ్ విత్ సుధ అండ్ రఘునందన్ టు మై ప్రయివేట్ రూమ్— రెవరెండ్ ఫాదర్ మైకేల్'

ఫాదర్ పిలుపులో ఏదో ప్రత్యేకత వుంటుంది. ఎంతో అత్యవసరమైన పని వుంటేనే కాని నన్ను తన వద్దకు పిలిపించుకోసే వ్యక్తి కాదు. తెల్లటి దుస్తులతో చిరునవ్వులు ఉట్టిపడే ముఖంతో, తెల్లని గడ్డాన్ని మునివ్రేళ్ళతో సవరిస్తూ స్కూల్ కాంపౌండ్ లోనూ, హాస్టల్ ఆవరణలోనూ, బైబిల్ ను చేతిలో పట్టుకొని తిరుగుతుండే ఆ ఫాదర్ ను చూస్తే మనకు అతనిలో ఏదో అవ్యక్తానుభంధం వున్నట్లు తోస్తుంది. సుధను హాస్టల్ లో చేర్పించేందుకు మైథిలి వచ్చినప్పుడు నన్ను పిలిపించి ఫాదర్ ఆమెను నాకు పరిచయం చేశాడు. (అప్పటికీ ఆమెతో నాకు ఉత్తరాలద్వారా పరిచయం) నేను చిరునవ్వు నవ్వుతూ మైదిలి కేసి చూస్తూ నిల్చుండి పోయాను. ఇప్పటికిది గడిచి అయి దారు నెలలు కావస్తుంది. కాని ఎప్పుడూ గుర్తుకు వచ్చే సంఘటన అది...

నేనూ, సుధా, రఘునందన్ ప్రయివేటు రూము దగ్గరకు వెళ్ళేసరికి ఫాదర్ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ అప్పుడప్పుడు ఏదో కాగితంమీద రాస్తున్నాడు. నేను ఫాదర్ పిలుపు కోసం డోర్-కర్టన్ దగ్గర నిలుచుండి పోయాను కొద్దిసేపున్న తర్వాత ఫాదర్ మా ముగ్గుర్నీ పిలిచాడు. మేం ముగ్గురం వెళ్ళి ఫాదర్ కెదురుగా ఉన్న కుర్చీలలో కూర్చున్నాము. ఫాదర్ కొద్దిసేపున్న తర్వాత సుధ వైపు తిరిగి మెల్లగా చిరునవ్వుతోనే- 'నీవలా చేయడం తప్పుకదూ' అన్నాడు. నేను మౌనంగా ఉండి పోయాను. సుధనుండి కొద్దిసేపటిదాకా సమాధానం రాలేదు. తలవొంచుకొని, మౌనంగా నేలకేసి చూస్తుండి పోయాడు. ఫాదర్ తిరిగీ సుధకేసి చూస్తూ అన్నాడు- 'సుధా! మన హాస్టల్ ఫౌంటన్ వద్ద పచ్చికలో నీకు 'కృష్ణ' ఫౌంటన్ పెన్ దొరికిందటగా! ఎవరికైనప్పటికీ దొరికిన వెంటనే వార్డన్‌కు గాని, నాకుగాని అలాంటి వస్తువుల్ని ఇవ్వాలి. లేకున్న పోగొట్టుకున్న వ్యక్తికైనా ఇవ్వాల. అలా ఎవ్వరికీ ఇవ్వకుండా నీదగ్గరే వుంచుకోడం తప్పు సుమా! మనం ఏదైనా తప్పు చేస్తే అంతకు రెట్టింపు బాధ కలిగేలా మనకు భగవంతుడు చేస్తాడు. ఇక ఇలాంటి తప్పులు చెయ్యనని భగవంతుని ప్రార్థించు' సుధ ఏమీ మాట్లాడలేదు. కళ్ళల్లోనుంచి అనిముత్యాల్లా జారుతున్న కన్నీరే ఫాదర్‌కు సమాధానం చేప్తుంది. సుధ పశ్చాత్తాపం కన్నీరు గుండా బయటకు పొంగి వస్తుంది. ఫాదర్ సుధను తన దగ్గరగా తీసుకొని తన కర్చీఫుతో అతని కళ్ళను తుడుస్తూ 'పశ్చాత్తాపం మన పాపాల్ని పోగొడుతుంది' అన్నాడు ఫాదర్ కళ్ళల్లో ఏదో వింత కాంతి శరత్ చంద్ర చంద్రికల్లా మెరిసి పోతుంది. సుధ తను చేసిన తప్పును పశ్చాత్తాప తెలిపేసరికి నా మనస్సు ఆనందంతో పొంగిపోయింది. కొద్దిసేపు ఆ ఆనందంలో మాట్లాడలేక పోయాను. సుధవైపు అలాగే చూస్తుండటం తప్ప...

మరుసటి దినం, స్కూలు ఆవరణంలో, వేప చెట్ల నీడల కదలికలలో మేమంతా 'ప్రేయిర్-క్లాస్'లో అసెంబుల్ అయినప్పుడు ఫాదర్ వచ్చి హెడ్‌మాష్టర్ ప్రక్కగా నిల్చున్నాడు. వీక్షణంగా దేన్నో గురించి ఆలోచిస్తున్న కన్నులు, చెదిరిపోయినట్లున్న క్రాపు, గాలిలో తేలియాడుతున్నట్లున్న చివిరిగడ్డం, తెల్లని దుస్తుల్లో వున్న ఫాదర్ కేసి వొక్కసారి విద్యార్థులు తమ దృష్టిని కేంద్రీకరించారు. 'కార్డినల్-న్యూమన్' వ్రాసిన 'లీడ్ కైండ్లీ లైట్' అన్న పద్యం విద్యార్థుల కంఠాలనుండి గాలిలో కెరటాలలో తేలిపోతూ గుండెల్లో మార్మోగుతుంది. ఉపాధ్యాయుడు మైక్‌లో ఓ నీతి కథను కన్నడంలో చెప్పి తర్వాత వార్తలు చెప్పాడు. ఫాదర్ మరో రెండు అడుగులు ముందుకు వేశాడు. ఏదో సత్యాన్ని అన్వేషించినట్లు ఆయనకళ్ళు తళతళా మెరుస్తున్నాయ్. 'డియర్ ఫ్రెండ్స్' అన్న వాక్యాన్ని మెల్లగా నొక్కి పలికి ఫాదర్ మెల్లగా విద్యార్థుల కేసి చెప్పడం మొదలు పెట్టాడు. 'సరిగ్గా యాభయ్యేళ్ళ క్రితం ఈ మహానగరం ఒక గ్రామంల్లో వున్నపుడు సామాన్యునికి కూడా విద్యాగంధం వ్యాపించేలా చేయాలనే కుతూహలంతో రెవరెండ్ ఫాదర్ కున్ ఒక పర్ణ కుటీరంలో మొదటి తరగతికి ఈ పాఠశాలను ప్రారంభించారు, ఆనాటి మొక్కే ఈనాడు మహావృక్షమై అనేకులకు నీడను కల్పిస్తుంది. ఆనాటి పర్ణశాల ఇంతటి పాఠశాల అయిందన్న ఈ పాఠశాల పేరు ఇప్పుడు నలుదిశలా వ్యాపించిందన్నా, దాని వెనుక అనేకుల అకుంఠిత దీక్ష, దృఢవిశ్వాసం, సంకల్ప బలం వుందన్న మాట. జీవితంలో మనం ఏదైన సాధించాలన్నా దాని వెనుక మనం విశ్వాసం, మంచి తనం, సత్యాన్వేషణ మొదలైన గుణాలను మనం మనంతకే రూపొందించుకోవాలి. అప్పుడే మనం దాన్ని సాధించ గలుగుతాం. అప్పుడే మానవుడు మానవుడవ గలుగుతాడు. అందుకే విద్యార్థి దశనుండే మనం అనేకమైన మంచిగుణాలు నేర్చుకోవాలి. ఇతరుల వస్తువులు దొంగిలించ కూడదు. ఎల్లప్పుడూ సత్యమే పలకాలి. అప్పుడే దేవునికి మనపై కరుణ కలుగుతుంది. లేకున్న మనమే కష్టాల పాలవుతాం.' ఫాదర్ చేతిలో నల్లటి రేపర్ వెయ్యబడ్డ బైబిల్ నీరెండలో మెరుస్తుంది. ఫాదర్ చెప్పిన ఒక్కొక్క మాట నా గుండెల్లో మార్మోగుతుంది. ఫాదర్ జాతీయగీతం అయిన తర్వాత చిఱునవ్వులను విద్యార్థుల పైకి విసురుతూ నిదానంగా హాస్టల్ వేపుకు నడుస్తూ వెళ్ళి పోయాడు. ఫాదర్ మాటల వెనుక సుధ ప్రవర్తనను గూర్చిన ప్రస్తావన అణగివుందో! ఏమో!

'క్రిష్టమస్' పండుగ దగ్గరకు వస్తుంది. స్కూలు ఆవరణంలో వున్న 'సేక్రెడ్' హార్ట్ చర్చ్'లో క్రిస్మస్కు గాను అలంకరణల హడావుడిలో ఫాదర్ మునిగి వున్నాడు. హాస్టల్ అకౌంట్స్ విషయంలో మాట్లాడాలను కొంటె ఫాదర్ ఎప్పుడూ ఏదో పనిలో నిమగ్నమైయి వుంటాడు. సాయంత్రం వేళ ఫాదర్ రూములో ఒక్కడే వున్నట్లుంటే లోనికి వెళ్ళాను, నమస్కారం చేస్తూ— ఫాదర్ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఆయన ముఖంలో విచార రేఖలు రంగులు మార్చు కొంటున్నాయి. కొద్దిసేపు మౌనం మా ఇరువురి మధ్యా రాజ్యం చేసింది. 'శాస్త్రి! చర్చిలోని రెండు కాండిల్ స్టాండ్స్‌ను నిన్న సాయంత్రం వేళ ఎవ్వరో దొంగిలించారు. నేను నమ్మలేక పోయాను. పవిత్రదేవాయం లోని వస్తువులను దొంగిలించేంత నీచుడుంటాడని నేను అనుకోలేదు. నిన్నటి దినం బయటవారు ఎవ్వరూ చర్చి లోనికి రాలేదు. ఎవ్వరో స్కూలు విద్యార్థులే ఈ పని చేసి వుండాలి' ఫాదర్ కేసి మౌనంగా చూస్తుండటం తప్ప నే నా సమయంలో ఏమీ చెయ్యలేక పోయాను.

మరుసటి రోజు నా పేరున టెలిగ్రాం వచ్చింది. ఫాదర్ ఎక్స్‌పైర్డ్, సెండ్ సుధ— 'మైథిలీ.' ఓ గాడ్! ఎంత పనిచేసావు. సాయంత్రం సుధను తీసుకవెళ్ళి ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కించి వచ్చాను, ఏడుస్తున్న వాన్ని ఊరడిస్తూనే - కొద్దిరోజులు గడిచాయి.

సుధ తిరిగి వచ్చి హాస్టల్‌లో చేరాడు. ఈ కొద్ది రోజుల్లోనే తండ్రి మరణంతో సుధలో ఎంతో మార్పు వచ్చింది. బాగా చిక్కి పోయాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఎవ్వరితోనూ మాట్లాడకుండా ముభావంగా కాలం గడుపు తున్నాడు. సుధ ప్రవర్తనలో మార్పు వచ్చినందుకు నేను సంతోషించాను. దిన దినం క్షీణించి పోతున్న సుధ ఆరోగ్యం ఒక వైపున బాధ కలిగిస్తుంది.

ఆదివారం నాడు హాస్టల్ నుంచి బయటకు వెళ్తూ చర్చి తలుపులు తీసి వున్నట్లు కన్పించే సరికి లోన ఎవ్వరున్నారో చూడాలని తలుపు దగ్గరగా వెళ్ళాను. శిలువ వేయబడ్డ ఏసు భగవానుని కరుణామయ దృష్టుల కేసి చూపులు నిగిడించి. చేతులు జోడించి 'ప్రభూ'! పవిత్రమైన ఆలయంలోని కాండల్ స్టిక్స్‌ను దొంగిలించి నందుకు నా నుంచి నా తండ్రిని వేరు చేశావు. ప్రభూ! ఇక ఎప్పటికీ దొంగతనం చేయను. సరియైన నీ మార్గంలోనే, నీవు చూపిన వెలుగు బాటలోనే సంతతమూ సంచరిస్తాను, అని అంటున్న సుధ కేసి నేను సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండి పోయాను. ఏసు భగవానునికి శిలువ చుట్టూ వెలుతురు కిరణాలు రంగులు మార్చు కొంటున్నాయి. ప్రార్థన సమయం కానప్పటికీ, ఎవ్వరో మ్రోగిస్తున్నట్టే గుడిగంటలు శబ్దం మెల్లగా నా చెవుల్లో మారోగ్రుతుంది. అచేతనంగా అడుగులు ముందుకు వేశాను...

◆

ఈ యిద్దరు సోదరీమణులు

రేణుక, క్షేమ

ఈమధ్య యీ చిరంజీవు లిద్దరు

మద్రాసులోని గోఖలే హాలులో

'రంగపూజ' నృత్యప్రదర్శన

నిచ్చారు.

◆

